క్లుప్తంగా

వృద్ధులకు పాదరక్షల పంపిణీ



వృద్ధులకు పాదరక్షలు అందిస్తున్న ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేట కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. దాతృత్వానికి కులం, మతం అడ్డు కాదని విశ్వ ప్రేమతో సమాజ సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా శివకుమార్



అధ్యక్షుడు శివకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీనియర్ సభ్యుడు బాపిరాజు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ది ఈస్ట్ గోదావరి జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ జె.శివకుమార్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ కె.సూర్యారావు తెలిపారు. కాకినాడ జయా రెసిడెన్సీలో ది ఈస్ట్ గోదావరి జిల్లా క్రికెట్ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంలోని ఆరు పోస్టులకు ఎన్నికల అధికారి సూర్యారావు ఎన్నికలు నిర్వహించారు. అయితే ప్రతి పోస్టుకు ఒక్కో నామినేషన్ రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సూర్యారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ శివకుమార్, కార్యదర్శిగా కొప్పన ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.బంగార్రాజు, సంయుక్త కార్యదర్శిగా నక్కా శ్రీనగేష్, కోశాధికారిగా బీఎస్ఎన్ మూర్తి, కౌన్సిలర్‌గా ఏవీటీ వర్మ, మెయిల్ రిప్రజెంటేటివ్‌గా బీవీఎస్ నరసింహారావు, ఫిమేల్ రిప్రజెంటేటివ్‌గా మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ 11 ఏళ్లుగా జిల్లాలో క్రికెట్ క్రీడ అభివృద్ధికి నోచుకోలేదని, ఏసీఏ సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో సీనియర్ క్రికెట్ సంఘ సభ్యులు ఏఎస్ స్వరూప్, బాపిరాజు, డీవీఎన్ రాజు, దంటు భాస్కర్, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం

కాకినాడ రూరల్: ప్రధాని మోదీ పిలుపు మేరకు వచ్చే 75 రోజుల పాటు అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమం నిర్వహించాలని, ఇందులో అంతా భాగస్వాములు కావాలని బొలిశెట్టి వెంకటరమణ రామకృష్ణ కోరారు. రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ జిల్లా కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, పెండెం సత్యనారాయణ, నందూరి సత్తిబాబు, పాలిక శివ, కండవిల్లి వెంకట్, పారుపల్లి లక్ష్మణ్, అజయ్, సలాది నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు 23న అంతరాయం

కాకినాడ సిటీ: ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హైవే లైన్ షిఫ్టింగ్ వర్క్ నిమిత్తం 33/11 కేవీ లైన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమ్మ ఘాటీ విద్యుత్ ఉప కేంద్రంలోని 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో కొవ్వూరు రోడ్డు, కొవ్వూరు, డి-మార్ట్ శుభం కౌంటీ, గ్యాస్ గొడౌన్ రోడ్, అరట్లకట్ట పంప్ హౌస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉదయం 9 నుంచి నీటి సరఫరా

బోట్‌క్లబ్: యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో కాకినాడ కార్పొరేషన్‌లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఇవ్వాల్సిన తాగునీరు ఉదయం 9 గంటల నుంచి సరఫరా చేయనున్నారు. ఈ విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

35 మంది వైద్యుల బదిలీ

కాకినాడ క్రైం: సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 35 మంది వైద్యులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి వారికి ఆదేశాలు అందాయి. బదిలీ అయిన వారిలో 8 మంది ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 23 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు.

నాడు సురక్ష... నేడు కక్ష

- గత ప్రభుత్వంలో జగనన్న సురక్షతో పల్లెల్లో వైద్య సేవలు
- కూటమి వచ్చాక అటకెక్కిన వైనం
- గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్

కాకినాడ సిటీ: ఆరోగ్యమే మహాభాగ్యం.. ఇది మన పెద్దలు చెప్పే మాట. దీనిని నిజం చేయాలని గత ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసింది.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. ప్రతి నెలా గ్రామాల్లో నిపుణులైన వైద్యులు, సిబ్బందితో జగనన్న సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించింది. ఇంటి వద్దకే వైద్యాన్ని తీసుకొచ్చింది. ప్రజలకు 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసింది. పరిస్థితి విషమంగా ఉండే వారికి సమీపంలోని ఆరోగ్యశ్రీ ఆసుపత్రికి రిఫర్ చేసి వైద్య సేవలకు సూచించేది. ఇవన్నీ గత ప్రభుత్వంలో మాట. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయ్యింది. ఆ సేవలన్నింటికీ మంగళం పాడింది. దీంతో పల్లెల్లో వైద్యం దైవాధీనం అయ్యింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో 13 యూపీహెచ్‌సీలు, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఐదు పీహెచ్‌సీ ఉన్నాయి. పీహెచ్‌సీల్లో రోజూ 80 నుంచి 120 మంది రోగులు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీల్లో సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ 300కు పైగా ఓపీ నమోదవుతుంది. కాకినాడ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో దాదాపు 2,500 నుంచి 2,800 వరకూ ఓపీ ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం, పల్లెల్లో దోమల బెడద అధికం కావడం, తీవ్రమైన ఎండల నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులకు వాంతులు, విరేచనాలు, జ్వరాల వంటి వ్యాధులతో ఆసుపత్రులకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఆసుపత్రులకు రాలేని వారి పరిస్థితి దీనంగా మారింది.

గతమెంతో ఘనం

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పక్కనబెట్టింది. తద్వారా పల్లె వైద్యం పడకేసింది. ఇంటి వద్దకే దూరమైంది. వ్యాధులొస్తే ఆయా మండల కేంద్రాల్లోని ఆసుపత్రులకు, పట్టణాల్లో సీహెచ్‌సీలకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేసింది. ప్రతి సచివాలయం పరిధిలోనూ ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య నిపుణులతో రోగులకు సేవలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు అందించింది. ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయించుకునేందుకు వీలుగా సిఫారసు చేసేది. పిల్లలు, గర్భిణులకు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె సంబంధిత రోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ఉచితంగా వైద్య సేవలు అందించేవారు. గుండె సంబంధిత వ్యాధి రోగులకు ఈసీజీ కూడా తీసేవారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చింది.

పట్టించుకోని కూటమి సర్కార్

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. ఇప్పుడు గ్రామాల్లో ఎక్కడా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై గ్రామాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇబ్బంది పడుతున్న ప్రజలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా వైద్యానికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించేది. ఈ శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు అలాంటి వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులు సోకినప్పుడు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాణ్యమైన వైద్యం అందుబాటులో లేక స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రాలు, ఇతర పట్టణాల్లో ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మాదిరి ఇంటి వద్దకే వైద్యం, ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగించాలి.

– రాయుడు శ్రీనివాస్, యండమూరు, కరప మండలం

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రదీప్, సరస్వతి, ప్రొఫెసర్ మురళీకృష్ణ

బోట్‌క్లబ్: ఇటీవల ఎంసెట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు స్థానిక కుళాయిచెరువు పార్కులో ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై వివరించారు. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు కె.ప్రదీప్, సరస్వతి, ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఏ గ్రూపులో చేరితే బాగుంటుందో తెలిపారు. ప్రదీప్ మాట్లాడుతూ ఇంటర్ పాసైన విద్యార్థులకు ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కైట్ విద్యాసంస్థల చైర్మన్ పోతుల విశ్వం బృందాన్ని అభినందించారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఈ సదస్సు వల్ల తమకు అసలు ఇంజినీరింగ్ అంటే ఏంటో అర్థమైందన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం



యోగా గురువు రామచంద్రరాజును సత్కరిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక నరసన్ననగర్ పాండురంగ స్వామి ఆలయం పక్కన ఉన్న పతంజలి యోగా సమితి భవనం వద్ద శుక్రవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులతో యోగా గురువులు రామచంద్రరాజు, షర్మిల ఆధ్వర్యంలో యోగా చేయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. యోగా గురువు రామచంద్రరాజు మాట్లాడుతూ యోగా అనేది వేల సంవత్సరాల నాటి పురాతన భారతీయ తత్వశాస్త్రం అన్నారు. ఇది ఆధ్యాత్మిక జ్ఞానోదయానికి మార్గంగా రూపొందించబడిందన్నారు. యోగాలో అనేక రకాలున్నాయని, కానీ ప్రతి ఒక్కటి తప్పనిసరిగా శ్వాస అవగాహనతో సాధన చేసే నిర్మాణాత్మకమైనవని అన్నారు. అనంతరం సభ్యులంతా కలసి యోగా గురువులను సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి, చైతన్య, సిరాజ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

కాకినాడ రూరల్: గైగోలుపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాలిక రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. యోగా డే సందర్భంగా విశాఖలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారని అన్నారు. నాయకుడు నందూరు సత్తిబాబు, యోగా గురువు వీరశంకర్, పెండెం సత్యనారాయణ, సలాది నాయుడు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీషర్టుల ఆవిష్కరణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శనివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు హాజరయ్యే సభ్యులకు అందించే నూతన టీషర్టులను సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6.30 నుంచి 8.30 వరకూ యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి ప్రముఖ యోగా ట్రైనర్ షర్మిల ముఖ్యఅతిథిగా విచ్చేసి సభ్యులతో యోగా చేయిస్తారని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ వ్యవస్థ కీలకం



విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజును సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్రజాస్వామ్యంలో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమైందని విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం రాకముందు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు కావడంతో ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూ శాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికలు నిర్వహించాలంటే కీలక పాత్ర పోషించేది రెవెన్యూ శాఖ అని అన్నారు. ట్రస్టు నిర్వాహకుడు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో బాపిరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓం నమశ్శివాయ, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కార్మికులు సిద్ధంకండి



కేంద్ర కార్మిక సంఘాల సదస్సులో మాట్లాడుతున్న దువ్వా శేషుబాబ్జీ

- కేంద్ర కార్మిక సంఘాల పిలుపు

కాకినాడ సిటీ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహించారు. బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోదీ ప్రభుత్వం మార్చేసిందని వక్తలు అన్నారు. భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నల్ల చట్టాలతో రైతులను, నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని, ప్రభుత్వ పథకాల్లో పని చేసే ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అసంఘటిత కార్మికులు కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోదీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 45 రోజుల నుంచి జరుగుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. 25వ తేదీ లోపు అన్ని పరిశ్రమల యాజమాన్యాలకు ప్రభుత్వ అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, 30వ తేదీ లోపు అన్ని మండల సదస్సులు నిర్వహించాలన్నారు. వచ్చే నెల ఐదో తేదీ వరకు విస్తృతంగా కరపత్రాల పంపిణీ, కార్మికులను కలుసుకొని సమ్మె ప్రాధాన్యతను వివరించాలని, 7, 8 తేదీల్లో అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, ఆటో ప్రచారం నిర్వహించాలని, 9వ తేదీ భారీ జన సమీకరణతో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలని కార్యాచరణను కేంద్ర కార్మిక సంఘాల సదస్సు ప్రకటించింది. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, తోలక ప్రసాద్, జె.వెంకటేశ్వర్లు, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ, వల్లూరి రాజబాబు, చెక్కల రాజ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, మలక రమణ, టి.రాజా, చంద్రమళ్ల పద్మ, బొబ్బిలి శ్రీనివాసరావు, ఆదినారాయణ, రామయ్య పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి సపర్యలు



కోలుకున్న వృద్ధుడితో బృందం

కాకినాడ క్రైం: మానవత్వం వెల్లివిరిసింది. రోడ్డుపై అచేతనంగా పడి ఉన్న వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించిన మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఐసీపీఎస్ విభాగం డీసీపీఓ వెంకట్, ఆయన బృందం కష్టం ఫలించింది. డీసీపీఓ బృందం కాకినాడ జీజీహెచ్‌లో చేర్పగా గురు, శుక్రవారాల్లో వృద్ధుడికి వైద్య సేవలు అందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం స్పృహలోకి వచ్చాడు. అక్కడికి చేరుకున్న డీసీపీఓ వెంకట్‌తో మాట్లాడే ప్రయత్నం చేశాడు. ఆకలేస్తుందని సైగల ద్వారా చెప్పడంతో వైద్యుల సూచనలతో అల్పాహారం అందించారు. కాకినాడకు చెందిన బాధ్యత చారిటబుల్ ట్రస్ట్, కృతజ్ఞ చారిటబుల్ ట్రస్టుల ప్రతినిధులు సత్యనారాయణ, డీసీపీయూ పీవోఐసీ శ్రీనివాస్‌లు డీసీపీవో వెంకట్‌తో కలసి వృద్ధుడికి క్షౌరం చేసి, స్నానం చేయించారు. శరీరంపై పుండ్లను శుభ్రం చేసి నర్సుల సాయంతో ఆయింట్‌మెంట్ పూశారు. స్వచ్ఛంద సంస్థలు వృద్ధుడికి దుస్తులు సమకూర్చాయి. వృద్ధుడి ఆరోగ్యంపై కలెక్టర్ కార్యాలయం ఆరా తీసింది. అత్యవసర విభాగంలో ప్రత్యేక వార్డులో చికిత్స కొనసాగుతుండగా, పూర్తిగా కోలుకున్న తరువాత ఐడీ వార్డుకి తరలిస్తామని జీజీహెచ్ వైద్యులు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో స్పృహతప్పి పడిపోయిన మహిళ

కరప: తన కుమార్తె ఆచూకీ తెలిసిందా అని అడగటానికి వెళ్లిన ఒక మహిళ కరప పోలీస్ స్టేషన్‌లో స్పృహతప్పి కింద పడిపోయింది. ఆమెను వైద్యం నిమిత్తం వేళంగి పీహెచ్‌సీకి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కరప గ్రామానికి చెందిన బాలిక (15)ను ఇదే గ్రామానికి చెందిన ఒక యువకుడు ఈ నెల 8న కిడ్నాప్ చేశాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె ఆచూకీ తెలియక తల్లి అప్పటి నుంచి ఆహారం తీసుకోవడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బాలిక తల్లిదండ్రులు, బంధువులు తమ కుమార్తె ఆచూకీ తెలుసుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడున్న కుర్చీల్లో కూర్చున్నారు. అప్పటికే నీరసించి ఉన్న బాలిక తల్లి స్పృహతప్పి కుర్చీలోంచి కింద పడిపోయింది. ఈ లోగా స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ టి.సునీత స్పందించి వైద్యం నిమిత్తం ఆటోలో వేళంగి పీహెచ్‌సీకి పంపించారు. డాక్టర్ శ్రీనివాస్ నాయక్ ఆమెను పరీక్షించి, వైద్య సేవలందించారు. ఆహారం తీసుకోకపోవడంతో సీరియస్ అయ్యిందన్నారు. పోలీసు స్పందించి తమ కుమార్తె ఆచూకీ తెలుసుకుని తమకు అప్పగించాలని బాధితులు కోరుతున్నారు.

ఆర్డీని కలసిన ఏపీఎన్జీఓ నేతలు



ఆర్డీ డాక్టర్ పద్మశశిధర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీఎన్జీఓ నాయకులు

కాకినాడ క్రైం: వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్ పూర్తి పారదర్శకంగా జరిగిందని ఏపీ ఎన్జీఓ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో నేతలు శుక్రవారం రాజమహేంద్రవరంలోని వైద్య ఆరోగ్య సేవల జోన్-2 రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మశశిధర్‌ను ఆమె కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించడం వల్ల ఉద్యోగులకు ప్రయోజనం చేకూరిందని అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ నిబంధనలు అనుసరించి జరిగేందుకు ఎన్జీఓ నేతలు ఎంతగానో సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీఓ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

రోడ్ల పరిశీలన

కరప: అరట్లకట్టలో రోడ్లను ఎమ్మెల్యే పంతం నానాజీ పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ను ఆయన అందజేశారు. దాతలు సమకూర్చిన డీసీఆర్, ప్లేజోన్ రూమ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, హెచ్ఎం విశ్వేశ్వరరావు, పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ఏం చేశారో చెప్పండి

- సీపీఎం డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా కాకినాడ నగర అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని సీపీఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం నగర నాయకులు కె.సత్తిరాజు, పలివెల వీరబాబు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. తల్లికి వందనం పథకంలో నిబంధనల వల్ల చాలామంది అనర్హులుగా మిగిలిపోయారని అన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని గతంలో లోకేష్ పిలుపు ఇచ్చారని, నేడు గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు రక్షణ విషయంలో కూడా మాట మార్చారన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్లకు జీతాలు పెంచలేదన్నారు. కాకినాడ నగర అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కూటమి పెద్దలు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలో యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైఖరి వల్ల కాకినాడ పోర్టులో ఎగుమతి, దిగుమతులు తగ్గిపోయి అనేక మంది ఉపాధి కోల్పోతున్నారన్నారు. గత రెండున్నర ఏళ్లుగా కాకినాడ నగరపాలక సంస్థకు పాలకవర్గం లేదన్నారు. నగరంలో ఎన్నికలు నిర్వహించి ప్రజా పాలనను సాగించడానికి కూటమికి సమస్య ఏంటని అని అడిగారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జగన్నాథపురంలో వాటర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ఏమైనా నిధులు రాబట్టారా, చాలా కాలంగా సాగుతున్న నగరపాలక సంస్థ కార్యాలయ నిర్మాణానికి నిధులు సాధించారా అని ప్రశ్నించారు. నగరంలో పారిశుద్ధ్య కార్మికులు రిటైర్ అవుతున్నారని, పెరిగిన పని భారానికి అనుగుణంగా సిబ్బందిని పెంచడానికి, ముంపు, డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్రాందీ షాపులు తొలగించాలి

నగరంలో 36 బ్రాందీ షాపులు సమయపాలన లేకుండా నడుస్తున్నాయని, ప్రజలు అభ్యంతరం తెలిపిన చోట బ్రాందీ షాపులు తొలగించాలని సీపీఎం కోరినా ప్రభుత్వ పెద్దల స్పందన లేదన్నారు. దుమ్ములపేట, ఏటిమొగల్లో మున్సిపల్ హైస్కూల్, మరో రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నగరంలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. జగన్నాథపురం ఉప్పుటేరుపై మూడో వంతెన నిర్మాణం, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయాల్సి ఉందన్నారు. జీజీహెచ్ సమీపంలో అన్నా క్యాంటీన్ అవసరం ఉందన్నారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు నగర అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ఏడాది కాలంలో ఏం చేశారో చెబితే బాగుంటుందన్నారు. సమావేశంలో మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.